పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా। ఎన్.టి.ఆర్. జిల్లా। గుంటూరు జిల్లా। పల్నాడు జిల్లా। బాపట్ల జిల్లా

# 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు... జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా..



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 12. ఐటీ, క్వాంటం, ఏఐ వంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే.. వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా అలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ క్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని సీఎం ప్రకటించారు. రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో ప్రచారం కల్పించాలని.. అలాగే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఇదే సందర్భంగా ఇటీవల జరిగిన వివిధ ఘటనలపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వేట్లపాలెం బాణాసంచా పేలుళ్లు, శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనల్లో అధికార యంత్రాంగం అలక్ష్యంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిలియనీర్ల కోసం పని చేయడం లేదని.. పేదల కోసం పని చేస్తోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకుని ముందుకు వెళ్తున్నాం. ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్సు చేస్తున్నాం. గతంలో కార్యాలయాల్లో కూర్చుని ఫైల్స్ రాసే పరిస్థితి నుంచి వర్చువల్ పని విధానాన్ని తీసుకువచ్చాం. గడచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకువచ్చాం. ప్రభుత్వం తెచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. వీటి అమలులో ఉదాసీనత వద్దు. 2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా తెచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తే సుపరిపాలన అందించేందుకు వీలవుతుంది. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాటు కూడా దొర్లకుండా పారదర్శకంగా అమలు చేయాలి. 13 తేదీన అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులు విడుదల చేస్తున్నాం. కేంద్రం ఇచ్చే వాటితో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్ము జమ చేస్తుంది. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్దాం. ప్రజల్లోకి వెళ్లి... ఈ పథకం గురించి చెప్పాలి.. డబ్బులు విడుదల చేస్తున్నామని వివరించాలి. ఖరీఫ్ సాగు కోసం మే 15 తేదీన నీటిని విడుదల చేస్తున్నాం. సీజన్లో ముందుగానే నీరు ఇస్తాం. మే 15 నుంచే సాగుకు సిద్ధం అవుదాం. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ వ్యవసాయ దారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలి.అని ముఖ్యమంత్రి సూచించారు...

# శనగ రైతులకు 55 కోట్లకు పైగా నష్టం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి.. తిరుపతి రావు, వై.వి. సుబ్బారావు..



పెన్ పవర్,గుంటూరు: మార్చి, 12. గుంటూరు జిల్లాలో ఈ సంవత్సరం శనగ పంట విస్తృతంగా సాగు చేయబడినప్పటికీ గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తులిమిల్లి శ్రీనివాసరావు సంయుక్తంగా గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కలిసి వినతి పత్రాన్ని అందించారు. అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 18,002 హెక్టార్లలో (44,484 ఎకరాలు) శనగ పంట సాగు చేయబడింది. ఈ పంటను జిల్లాలోని 20,615 మంది రైతులు సాగు చేశారు. ఎకరానికి సగటున 10--12 క్వింటాళ్ల దిగుబడి రావడంతో జిల్లాలో సుమారు 53,000 టన్నులు (5,30,000 క్వింటాళ్లు) శనగ ఉత్పత్తి అయ్యిందనీ వై.వి.సుబ్బారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం శనగ పంటకు ?5875 రూపాయలు ప్రతి క్వింటాల్ కనీస మద్దతు ధర ( ఎం ఎస్ పి ) ప్రకటించినప్పటికీ ప్రస్తుతం మార్కెట్లో రైతులకు 4500--?4800 మాత్రమే ధర లభిస్తోందనీ అన్నారు. దీంతో ప్రతి క్వింటాల్‌కు రైతులు 900--1100 వరకు నష్టపోతున్నారన్నారు. ఈ లెక్కల ప్రకారం గుంటూరు జిల్లాలోని శనగ రైతులకు మొత్తం 50 కోట్లకు పైగా (సుమారు ?55 కోట్లు) నష్టం జరుగుతున్న పరిస్థితి ఏర్పడిందని వై.వి.సుబ్బారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎం ఎస్ పి ప్రకటించినప్పటికీ జిల్లాలో సరైన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల రైతులు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది అని బిజెపి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు అన్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ తక్షణమే స్పందించి జిల్లాలో శనగ పంటకు యం.యస్.పి ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని తిరుపతి రావు, వై.వి. సుబ్బారావు, టి . శ్రీనివాసరావు సంయుక్తంగా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, బిజెపి పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్ర శేఖర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మంచికిలపూడి గంగాధర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు టీ. రామారావు, బిజెపి జిల్లా కార్యదర్శి నారాయణ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాంద్రు భాను కిశోర్, కార్య దర్శి జూటూరి మురళి కృష్ణ, బొమ్ము శంకర్ రెడ్డి, తోట సాంబశివ రావు , తోట కూర కోటేశ్వర రావు , ఆళ్ల దాసు, బిళ్ళల సుధాకర్ మరియు కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు జాయింట్ కలెక్టర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# చట్టబద్ధ బీసీ రిజర్వేషన్లతోనే ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లాలి కేసన శంకరరావు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 12: రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు జరిపే ముందే సమగ్రంగా కులగణన చేసి, విద్య-ఉద్యోగాలలో మాదిరిగా ఏబిసిడిఈ వర్గీకరణ చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. ఈరోజు స్థానిక బాపట్ల లో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా వారు ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంగా ప్రకటించిన 33 శాతం చట్టసభలలో గాని, 34 శాతం స్థానిక సంస్థలు-నామినేటెడ్ పోస్టులు-నామినేషన్ వర్క్ లలో రిజర్వేషన్లు అమలు జరపాలన్నా ముందుగా కులగణన జరపాల్సి ఉందన్నారు. ఏ ఏ సామాజిక వర్గాలు ఎవరెంత మంది ఉన్నారో తెలియకుండా,ఎవరికని- ఎంతెంతని రిజర్వేషన్లు అమలు చేస్తారని వారు ప్రశ్నించారు. అందుకే ముందుగా కులగణనను సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఆపై బీసీలకు కేటాయించే చట్టబద్ధ రిజర్వేషన్లను వర్గీకరించి, అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా స్థానిక ఎన్నికలను నిర్వహించాలన్నారు. రాజ్యాంగ- న్యాయపర చిక్కులన్నింటినీ అధిగమించేలా రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు పర్చాలన్నారు.మొత్తం ప్రక్రియను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. మరో ఎన్నికల వాగ్దానమైన బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని కూడా త్వరలో రూపొందించి అమలు జరపాలన్నారు. అనేక దశాబ్దాల పోరాట ఫలితంగా జాతీయస్థాయిలో జనగణనతో పాటే సమగ్ర కులగణనకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి విజయం సాధించామన్నారు. ఇంకా కేంద్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు,మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళకు సబ్-కోటా, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు,ఓబిసి సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్లో నిధుల కేటాయింపులు చేయాలనే పలు డిమాండ్లపై పోరాటాలను ఉధృతం చేస్తా మన్నారు.ముందుగా జనగణనతో పాటు కులగణన చేసి, బీసీల జనాభా లెక్కలు తేల్చాలన్నారు. జనాభా దామాషా మేరకు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు చట్టబద్ధంగా నిర్ధారించాలన్నారు. అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా సదరు రిజర్వేషన్లను ఏబిసిడిఈ లుగా వర్గీకరించాలన్నారు. అదే సమయంలో రిజర్వేషన్ల పైన సుప్రీంకోర్టు విధించిన 50 శాతం సీలింగు కూడా మన రాష్ట్రానికి వర్తించదని మరో చట్టం చేయాలన్నారు. కేంద్ర-రాష్ట్రాలలో తమరి డబుల్ ఇంజన్ సర్కారే ఉన్నందున అవసరం మేరకు పార్లమెంటు చే రాజ్యాంగ సవరణలైనా చేయించి, రాజ్యాంగం షెడ్యూల్-9 లో బిసి రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి,సంపూర్ణ చట్టబద్ధత కల్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరితార్థులు కావాలని శంకరరావు ఆకాంక్షించారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో ఆ సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఏస్ పి రాజు, తెనాలి పట్టణ అధ్యక్షుడు వేముల కృష్ణ, యువజన నియోజకవర్గ అధ్యక్షుడు నర్రావుల సాంబశివరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కంకణాల రాంబాబు తదితరులు పాల్గొని

# అమరావతి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కళ్యాణ మండపంలో ఉచిత కంటి పరీక్షలు



అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: పల్నాడు జిల్లా అమరావతి:శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి గురువారం ఉచిత కంటివైద్యశిబిరం శంకర్ కంటి హాస్పటల్ నిర్వహించారు.దేవస్థానం అధ్యక్షులు చేగు రాము శిబిరాన్నిప్రారంభించారు.పేదవారికి ఉచిత వైద్యం అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని వారన్నారు.ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా 54 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 24 మందిని పరీక్షలు చేసి శంకర్ కంటి ఆసుపత్రికిపంపించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు కళ్ళజోళ్ళు పంపిణీ కూడా శంకర్ కంటి హాస్పిటల్ ద్వారా అందిస్తారని ఆయన అన్నారు

# రోడ్డు సేఫ్టీ కమిటీ మీటింగ్లు ఏర్పాటు చేయండి, సూచనలను తీసుకోండి..

## ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టండి.. అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 12: చిలకలూరిపేట : వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పరిష్కారాలను కనుగొనుటకు రోడ్డు సేఫ్టీ కమిటీ మీటింగ్ ను ఏర్పాటు చేయాలని అడ్వకేట్ ఇ సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ డిమాండ్ చేశారు. జరుగుతున్న ప్రమాదాలలో ఎక్కువ శాతం నివారించదగినవేనని కొంత అవగాహన రాహిత్యం, కొంత నిర్లక్ష్యం, అధికారుల మెతక వైఖరి ఈ ప్రమాదాలకు కారణమని అన్నారు. కొందరు ద్విచక్ర వాహనాలకు, కారులకు అధిక వెలుగునిచ్చే ఎల్ఈడీ బల్బులు వాడటం వలన ఎదుటివారికి వాహనాలను గుర్తించడం కష్టతరంగా మారుతుందని అన్నారు. కొందరు మైనర్లు సరైన నైపుణ్యం లేకుండా వాహనాలను నడుపుతున్నారని ఆ కారణం చేత కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అంతేకాకుండా ప్రమాదాలకు కారణం అవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రమాదాలు నియంత్రించడం సాధ్యమవుతుందని కనుక రోడ్డు సేఫ్టీ మీటింగ్ ఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకోవాలని కోరారు.

# విధులు నిర్వహిస్తూ ఆర్థిక అక్రమాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎ.పవన్ కుమార్ సస్పెండ్... నగర కమిషనర్ కె.మయూర్...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 12. పవన్ కుమార్ సచివాలయం పరిధిలో ఆస్తి పన్ను, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్,ఎల్ఆర్ఎస్ ఛార్జీల పేరుతో ప్రజల నుండి భారీ మొత్తంలో నగదు వసూలు చేసి, ఆ సొమ్మును కార్పొరేషన్ ఖాతాలో జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. అంతేకాకుండా, తక్కువ మొత్తానికి నకిలీ రశీదులు సృష్టించి ప్రజలను మరియు ప్రభుత్వాన్ని మోసగించినట్లు నిర్ధారణ కావడంతో, ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్, 1991 ప్రకారం తక్షణమే సస్పెన్షన్ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. పవన్ కుమార్ పై పోలీసు కేసు కూడా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం లేదా విధి నిర్వహణలో అవినీతికి పాల్పడటం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై మరింత కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ పన్నులు మరియు ఇతర మున్సిపల్ రుసుములను చెల్లించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పౌరులు తమ చెల్లింపులను నేరుగా నిర్దేశించిన జిఎంసి క్యాష్ కౌంటర్లలో లేదా అధికారిక వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించి, కంప్యూటర్ జనరేటెడ్ రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఎవరైనా వ్యక్తిగతంగా నగదు అడిగితే నమ్మవద్దని, పారదర్శకమైన సేవల కోసం అధికారిక మార్గాలనే ఎంచుకోవాలని ప్రజలకు సూచించారు.

# కాకతీయ కో ఆపరేటివ్ సొసైటీ ప్రారంభం రేపు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 12: కర్లపాలెం బుద్ధాం రోడ్డులోని మసీదు సమీపంలో మోహనరావు కాంప్లెక్స్ లో ఈనెల 14 తేదీ శనివారం ఉదయం 9.15 కు ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు చేతుల మీదగా కాకతీయ మ్యూచ్ వల్లి ఎయిడెడ్ త్రిఫ్ట్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్రాంచి ప్రారంభం గత 25 సంవత్సరాల క్రితం 2001లో క్రీస్తుశేషులు శ్రీ ధావులూరి సోమశేఖర రావు తెనాలిలో స్థాపించబడినది కాకతీయ కోపరేటివ్ సొసైటీ అంచలంచలుగా ఎదుగుతూ గౌరవాధ్యక్షులు దావులూరి లక్ష్మీకాంతారావు , చైర్మన్ దావులూరి చక్రధర్ చౌదరి సారధ్యంలో ప్రస్తుతం మన కర్లపాలెంలో 12వ బ్రాంచిని 14.3 .2026 శనివారం ఉదయం 9:15 నిమిషములకు ప్రారంభం చేసుకోవడానికి సన్నాహం అయింది .ఇప్పటికీ మన కాకతీయ కోపరేటివ్ సొసైటీ మొత్తం డిపాజిట్లు 150 కోట్లు, లోన్లు 140 కోట్లు. ఇప్పటికే ఐదు పట్టణాలలో సొంతభవనాలను ఏర్పాటు చేసుకుంది .50 మంది సిబ్బందితో 20 మంది కలెక్షన్ ఏజెంట్లతో వెనుతిరగని లాభాలతో విరాజల్లుతోంది .ప్రజల నమ్మకాన్నే తమ పెట్టుబడిగా చేసుకొని ముందుకు వెళుతుంది .ప్రస్తుతం డిపాజిట్స్ మీద అత్యధికంగా 10% వడ్డీని ఇస్తుంది .ప్రజలందరికీ మార్ట్ గేజ్ లోన్స్ ,గోల్డ్ లోన్స్ ,పర్చేసింగ్ లోన్స్ సకాలంలో సహకారం అందిస్తూ సొసైటీ కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందనీ చక్రధర్ చౌదరి తెలిపారు.

# 385 మంది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చ్, 12: భట్టిప్రోలు మండల పరిధిలోని ఏడు ఉన్నత పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న 385 మందికి పరీక్షా సామగ్రిని అందించినట్లు భట్టిప్రోలు పిఎసిఎస్ చైర్పర్సన్ పరుచూరి రమేష్ గురువారం తెలిపారు.ఈ సందర్భం గా రమేష్ మాట్లాడుతూ తానా ఫౌండేషన్ ట్రస్టీ కంతేటి త్రిలోక్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భట్టిప్రోలు పాఠశాలలో 62 మంది, సూరేపల్లి పాఠశాలలో 23 మంది, కే..పల్లికోనలో 60 మంది,ఐలవరం పాఠశాలలో 73 మంది,పెదపులివరు లో 34 మంది, పెసర్లంక లో 62 మంది,వెల్లటూరు పాఠశాల లో 71 మంది 10 వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందించినట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు ఏడు కొండలు,లెనిన్ పాల్గొన్నారు.

# మూడు అంతస్తుల రజక భవన్‌ను ప్రారంభించిన.. ఎమ్మెల్యే గళ్ళా మాధవి...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 12. తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బీసీలకు మరింత చేయూతనిస్తూ వారి అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. గురువారం గుంటూరు నగరంలోని 52వ డివిజన్ అరండల్‌పేట 12/2 లైన్‌లో నిర్మించిన రజక భవనాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రజక సంఘ నాయకులు, కమ్యూనిటీ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రజకుల సమాజం ఎన్నో సంవత్సరాలుగా కోరుకుంటున్న రజక భవన్ ప్రారంభించుకోవటం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ రజక భవన్ లో అనేక కార్యక్రమాలు నిర్వహించుకునేలా, కమ్యూనిటీకి ఒక కేంద్రంగా ఉండేలా ఈ భవనం అందుబాటులోకి రావడం రజక సమాజానికి ఒక మంచి పరిణామమన్నారు. గత ఐదేళ్లలో ఈ భవనం ప్రారంభానికి ఎలాంటి పురోగతి లేకపోయినప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రజకుల ఆకాంక్ష నెరవేరి ఈ భవనం ప్రారంభం కావడం ఆనందదాయకమని, ఈ భవనం నిర్మాణానికి సాంబశివరావు, కోటేశ్వరరావు తమ సొంత నిధులతో ముందుండి నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మూడు అంతస్తులతో నిర్మించిన ఈ రజక భవన్ రజకుల సమాజానికి సంబంధించిన సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, ఇతర కార్యకలాపాలకు ఎంతో ఉపయోగపడే విధంగా రూపొందించబడిందని, అదేవిధంగా పలువురు రజక నాయకులు, శ్రేయోభిలాషులు కూడా ఈ కార్యక్రమానికి సహకారం అందించి భవనం నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశంసించారు. నరసరావుపేట సహా పలు ప్రాంతాల నుంచి కమ్యూనిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమని అన్నారు. తనను రజక సమాజం తమ ఆడపడుచుగా భావించి ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం తనకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ భవనాన్ని ప్రారంభించడం తనకు కూడా ఒక ప్రత్యేకమైన అనుభూతి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# క్లస్టర్ వ్యవస్థతో టిడిపి మరింత బలోపేతం --ఎమ్మెల్యే ఆనంద బాబు.



వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్ మార్చి, 12: పేదల సంక్షేమం, తెలుగు జాతి గౌరవం కోసం ఎన్టీఆర్ చూపిన మార్గంలోనే తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని,ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి--సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారని వేమూరు శాసనసభ్యులు,మాజీ మంత్రి,తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద బాబు. తెలిపారు. గురువారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు,క్లస్టర్ ఇంచార్జిలకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆశయాలే తెలుగుదేశం పార్టీకి మార్గదర్శకమని పేర్కొన్నారు.ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి క్లస్టర్ వ్యవస్థ కీలకం పార్టీ బలోపేతానికి క్లస్టర్ వ్యవస్థ అత్యంత కీలకమని పేర్కొన్నారు.గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు సమన్వయంతో పనిచేస్తే పార్టీ మరింత బలపడుతుందన్నారు. మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్ ఆశయాల సాధనకే టిడిపి కట్టుబాటు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాకుండా తెలుగు ఆత్మగౌరవ ఉద్యమమని ఆయన పేర్కొన్నారు. విలువలు,క్రమశిక్షణ, నిజాయితీ,సమాజ సేవ వంటి లక్షణాలే టిడిపి బలమని తెలిపారు."సమాజమే దేవాలయం--ప్రజలే దేవుళ్లు"అనే ఎన్టీఆర్ సిద్ధాంతం ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబమని అన్నారు. సామాన్యులకు నాయకత్వ అవకాశాలు కల్పించిన పార్టీ టిడిపి అన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత రాజకీయాల్లో అట్టడుగు వర్గాలు, వృత్తి నిపుణులు, విద్యావేత్తలకు నాయకత్వ అవకాశాలు కల్పించబడినట్లు ఆయన తెలిపారు. ఉన్నత విద్యాభ్యాసం చేసిన యువతకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. పెద్దలకు గౌరవం ఇస్తూ యువతకు పెద్దపీట వేస్తున్న పార్టీ టిడిపి అని తెలిపారు. చైతన్య రథయాత్రతో రాజకీయ చరిత్రలో మలుపు 1982లో ఎన్టీఆర్ చేపట్టిన చైతన్య రథయాత్ర తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని అన్నారు. ఆ యాత్ర ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని కలిగించడంతో పాటు తెలుగు గౌరవాన్ని నిలబెట్టిందని తెలిపారు. ప్రతి ఎన్నికలో విజయమే లక్ష్యం రానున్న రోజుల్లో జరిగే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీ ఎన్నికల్లో మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలు సమన్వయంతో పనిచేసి తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించాలన్నారు.ఈ ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

# విద్యార్థికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

## నారా లోకేష్ హామీ తో రూపుదిద్దుకున్న ఒప్పిచర్ల స్కూల్ ప్రధాన రహదారి





పెన్ పవర్ కారంపూడి ఫిబ్రవరి 12: గత సంవత్సరం పదవ తరగతిలో పల్నాడు జిల్లా, కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన అంగడి పావని చంద్రిక స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 600మార్క్ లకు 598 సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా అమరావతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో సమావేశంలో పాల్గొన్నారు. ఆ సమావేశంలో పల్నాడు జిల్లా, కారంపూడి మండలం, ఒప్పిచర్ల గ్రామానికి చెందిన పావని చంద్రిక నారా లోకేష్ తో మాట్లాడుతూ స్కూల్ కి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంతో.. ఏ ప్రభుత్వం వచ్చినా రహదారిని పట్టించుకోవడం లేదంటూ లోకేష్ తో ఆ విద్యార్థి వాపయ్యారు. వర్షం పడితే స్కూల్ కు ఉపాధ్యాయులు రావడానికి కూడా వీలు లేకుండా ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని అన్నారు. అద్వానంగా ఉన్న ప్రధాన రహదారిలో పలుమార్లు ఉపాధ్యాయులు నడిచే క్రమంలో జారి కిందపడిన ఘటనలు మరెన్నో పునరావతం అయ్యాయని నారా లోకేష్ కూ ఆ విద్యార్థి బాధను వ్యక్తపరిచారు. అలాగే వర్షం పడితే స్కూల్ కి రావడానికి కూడా రహదారి పై నడిచే పరిస్థితి లేక ఎంతోమంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన ఘటనలు కూడా చూశామన్నారు . దీంతో వెంటనే నారా లోకేష్ స్పందించి .

. మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిని నిర్మించాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో..రూ. కోటి 80లక్షల వ్యయం తో రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెంటనే రహదారిని ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో విద్యార్థులు, గ్రామ ప్రజలు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# అభివృద్ధి మార్గంలో నరసరావుపేట... ప్రజలతోనే ప్రజా సేవ

## నరసరావుపేట అభివృద్ధి మరియు పేదల సంక్షేమమే ధ్యేయం

## అభివృద్ధిలో జిల్లాలోనే నంబర్ 2.. ప్రజా సేవలో ఎప్పుడూ నంబర్ 1








నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి12: నరసరావుపేట అభివృద్ధి మరియు పేదల సంక్షేమమే తన ధ్యేయమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్. చదలవడా అరవింద బాబు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో పల్నాడు జిల్లాలోనే రెండవ స్థానాన్ని సాధించడమే కాకుండా, ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండటం తన బాధ్యతగా భావిస్తున్నట్లు అయన తెలిపారు. గురువారం నరసరావుపేటలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 47 మంది లబ్ధిదారులకు రూ.28,77,774 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని అయన తెలిపారు. ప్రజల మధ్య నిరంతరం ఉండి వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఎమ్మెల్యే చెప్పారు. పారదర్శకమైన పాలన మరియు వేగవంతమైన అభివృద్ధి ద్వారా నరసరావుపేటను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పించడం, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం తన ప్రధాన లక్ష్యమని అయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసరావుపేట అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు పలువురు అభినందనలు తెలిపారు.

# రైతు బలపడితేనే దేశం బలపడుతుంది



నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి12: పల్నాడు జిల్లాలో రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత నిధులు శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ కానున్నాయని గురువారం జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. జిల్లాలో మొత్తం 2,40,530 మంది రైతులకు రూ.135.48 కోట్లు ఆర్థిక సహాయం అందనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విడతలో ప్రతి రైతుకు రూ.6,000 చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతాయని ఆమె వెల్లడించారు. రైతులు ఈ నిధులను రాబోయే పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు మరియు ఇతర వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల ఆర్థిక భారం తగ్గించి, వ్యవసాయ అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు.

# పల్లికొనలో ఘనంగా నిర్వహించిన వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవం.



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 12: మండల పరిధిలోని పల్లికోన గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక రైల్వే గేట్ సమీపంలో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ పార్టీ ఏర్పడిన నాటినుండి నేటి వరకు పార్టీ అవలంబించిన విధి విధానాలను తెలియజేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బోల్లెద్దు ప్రతాప్,ఓడుగు శీను, పడమట వాసు, పులివర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అధికార యంత్రాంగం అప్రమత్తం



నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి12: రానున్న వేసవిలో తీవ్రమైన ఎండ, వడదెబ్బలు, తాగునీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కోవడానికి పల్నాడు జిల్లా యంత్రాంగం సమ్మర్ యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేసింది. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాడేపల్లిలో మార్చి 10న ప్రవేశపెట్టిన హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ 2026 మార్గదర్శకాల మేరకు పల్నాడు జిల్లాలో జీరో క్యాజువాల్టీ (మానవ మరియు పశు మరణాలు శూన్యం) లక్ష్యంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి. నారద ముని, నరసరావుపేట ఆర్.డి.ఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వారు తమ శాఖల వారీగా రూపొందించిన ముందస్తు ప్రణాళికలను వివరించారు.

కీలక నిర్ణయాలు --

వడదెబ్బ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో అవగాహన పోస్టర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల సంస్థ (ఏపి.ఎస్..డి. ఎమ్.ఏ) నుంచి వచ్చే హీట్ అలర్ట్‌లను వెంటనే ప్రజలకు చేరవేయాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారికి తక్షణ చికిత్స అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్సీ)ల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవికి ఆదేశాలు జారీ చేశారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, కూడళ్లలో చలివేంద్రాలు (కూలింగ్ షెల్టర్లు) ఏర్పాటు చేసి, మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట ప్రత్యేక వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడంతోపాటు మంచినీటి చెరువులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల పని వేళలను సవరించారు. కూలీలు ఉదయం 7:00 గంటల నుండి 11:00 గంటల వరకు, సాయంత్రం 4:00 గంటల నుండి 7:00 గంటల వరకు మాత్రమే పని చేయాలి. మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల మధ్య బహిరంగ పనులు నివారించాలి. పని ప్రదేశాల్లో నీడ మరియు తాగునీటి సౌకర్యం కల్పించడం తప్పనిసరి చేశారు. పశువులకు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక శాఖతో సమన్వయం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో డి.పి.ఓ ఈ. నాగేశ్వర్ నాయక్, ఆర్టీసీ ఆర్.ఎం రజిత కుమారి, వివిధ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నరసరావుపేట పెద్ద మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి12: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం పట్టణంలోని 3వ వార్డు, గుంటూరు రోడ్డు నందు గల పెద్ద మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించి, వారందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట మత సామరస్యానికి నిలయమని, కులమతాలకు అతీతంగా అందరూ కలిసి పండుగలను జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని అయన అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని నేర్పుతాయని, అల్లాహ్ ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మసీదుల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ నుండి బలసాని సమక్షంలో వైసీపీలో చేరిక...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 12. గుంటూరు రూరల్ మండలం, ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, గుంటూరు రూరల్ మండలం, చినపలకలూరు గ్రామ జనసేన పార్టీ నాయకులు.కఠారి రత్న సాగర్. బలసాని కిరణ్ కుమార్ సమక్షంలో, పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో, గుంటూరు మండల పార్టీ ఉపాధ్యక్షులు కలిశెట్టి వెంకట్రావు మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.....

# టిడ్కోప్రాంతంలోని మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు: చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 12: చిలకలూరిపేట : పట్టణ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఐదు రోజులు ఇఫ్తార్ విందును పూర్తి చేసిన విషయం తెలిసిందే.. గురువారం టిట్కో గృహ సముదాయంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులంతా కలిసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి స్థానిక నాయకులు పాల్గొన్నారు..

దగ్గరుండి వడ్డించిన చైర్మన్ దువా అనంతరం మున్సిపల్ చైర్మన్ రఫాని స్వయంగా రంగంలోకి దిగి, ముస్లిం సోదరులకు దగ్గరుండి వంటకాలను వడ్డించారు. అందరితో కలిసి విందులో పాల్గొని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రంజాన్ మాసం పవిత్రతకు, సోదరభావానికి ప్రతీక పట్టణంలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఈ విందులను ఏర్పాటు చేస్తున్నాం." అని చైర్మన్ రఫాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం సోదరులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# ఘనంగా మాచర్ల జనసేన పార్టీ సమన్వయకర్త బుస రామాంజనేయులు జన్మదిన వేడుకలు



పెన్ పవర్ కారంపూడి మార్చి12:--- పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో వంగవీటి మోహన్ రంగ బొమ్మ వద్ద మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బుస రామాంజనేయులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన జన సైనికులు. ముందుగా కేక్ కట్ చేసి జన సైనికులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జనసైనికులు ఘనంగా సన్మానించి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని జనసేన పార్టీలో ఉన్నతి పదవులు పొందాలని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలెప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి



వినుకొండ : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఎమ్మెల్యేలు పనితీరును మరింత మెరుగుపరుచుకుని ప్రజల మన్ననలు పొందాలని పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీకి సిఎం చంద్రబాబు సూచించారు. పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కలెక్టర్ కృతికా శుక్ల, ఎస్పీ బి.కృష్ణారావుతో సిఎం బుధవారం సమీక్షించారు. శాంతిభద్రతలు పరిరక్షణ, జిల్లా సమగ్రాభివృద్ధి, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సిఎం సమీక్షించారు. జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు.

# పొలానికి నీరు పెడుతూ కౌలురైతు దుర్మరణం

సత్తెనపల్లి ం: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: పొలానికి సాగునీరు పెట్టేందుకు వెళ్లిన కౌలురైతు ప్రమాదవశాత్తు కాల్వలో పడి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని గుడిపూడిలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి (40) రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నాడు. పొలానికి నీరు పెట్టేందుకని మంగళవారం ఉదయం వెళ్లిన మస్తాన్‌వలి డ్రాప్ వద్ద దిగి మిర్చి పొలానికి నీరు మళ్లిస్తుడగా సిమెంట్ డ్రాప్ తలకు తగిలి నీటిలో పడిపోయాడు. అనంతరం లేవలేకపోవడంతో ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. పొలానికి వెళ్లిన మస్తాన్‌వలి సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబీకులు పొలానికెళ్లి చూడగా నీటిలో అతని మృతదేహం తేలుతూ కనిపించింది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా మన మహిళ - మన ఆత్మగౌరవం కార్యక్రమం

## పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ








ఎనరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి12: పల్నాడు జిల్లా నరసరావుపేటలో సమాజానికి సేవలందిస్తూ గ్రామాలు, పట్టణ వీధులు, కాలువలను శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య మహిళా కార్మికులను గౌరవిస్తూ గురువారం బీజేపీ పల్నాడు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మేళం మధుబాబు ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మరియు బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరు శశి కుమార్ సూచనల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మన మహిళ - మన ఆత్మగౌరవంఎకార్యక్రమం స్థానిక మున్సిపల్ గెస్ట్ హౌస్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత్ మాతాకీ జై అంటూ ముఖ్య అతిథులుగా పాల్గొన్న బిజెపి నాయకులు మహిళా శానిటరి ఇన్స్పెక్టర్ రమాదేవి ని మరియు పారిశుధ్య కార్మికులను పూలతో నమస్కరించి, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. పారిశుధ్య మహిళా కార్మికులు 140 మందికి చీరలు పంపిణీ చేసి, స్వచ్ఛభారత్ మెమొంటో అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఏలూరు శశి కుమార్ మాట్లాడుతూ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా మహిళలను గౌరవిస్తూ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానించి మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్య రక్షణ కోసం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని వారు తెలిపారు. సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలి, ఆ పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న కార్మికులు నిజమైన సేవకులని అయన పేర్కొన్నారు. పారిశుధ్య మహిళా కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటూ సమాజానికి సేవ చేయడం గొప్ప విషయమని అయన కొనియాడారు. ముఖ్యంగా కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ఫ్రంట్ లైన్ వారియర్స్ గా నిలబడి సమాజ సేవ చేశారని అయన గుర్తుచేశారు. వారి కష్టాన్ని గుర్తించి చిన్నపాటి గౌరవ సూచకంగా చీరలను అందజేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి తాము అండగా ఉంటామని ఆయన తెలిపారు. పల్నాడు జిల్లా మోర్చా అధ్యక్షులు మేళం మధుబాబు మాట్లాడుతూ స్థానికంగా పారిశుధ్య సేవలందిస్తున్న మహిళా కార్మికుల సేవలను గుర్తిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వారికి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఎండ, వాన తేడా లేకుండా ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరు శశికుమార్, జాతీయ కౌన్సిల్ నెంబర్ వల్లెపు కృపారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరంకుశం శ్రీనివాసరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏనుముల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు గోడవర్తి సుజాత, జిల్లా కార్యదర్శి కలవకుంట జాన్ బాబు, ముట్లూరి భాస్కరరావు మంద రామారావు, నేలపాటి జయకుమార్, వెంకట్, మేళం నిర్మలా, శానిటైజర్ ఇన్స్పెక్టర్ పి రమాదేవి, సెక్రెటరీ విజయ్, మేస్త్రి దానియేలు పరిశుద్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సరుకు రవాణాలో వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు



ఎంవిపి.కాలనీ : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12:భారతీయ రైల్వేలోని వాల్తేరు డివిజన్ సరుకు రవాణాలో అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త చరిత్ర సృష్టించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 24 రోజుల సమయం ఉండగానే, నిర్దేశించుకున్న 78.45 మిలియన్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని అధిగమించింది. మార్చి 7 నాటికి డివిజన్ 78.464 మిలియన్ టన్నుల రవాణాను పూర్తి చేసి రికార్డు నెలకొల్పింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చి 7 నాటికి డివిజన్ 67.254 మిలియన్ టన్నుల లోడింగ్ సాధించగా, ఈసారి ఏకంగా 16.5 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. ప్రకృతి వైపరీత్యాలు, భద్రతాపరమైన సవాళ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు (డబ్లింగ్, ట్రిపుల్ లైన్ ప్రాజెక్టులు) కొనసాగుతున్నప్పటికీ ఈ అసాధారణ ఫలితాలను సాధించడం గమనార్హం. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఈ సందర్భంగా ః టీమ్ వాల్తేరుఃను అభినందించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఃమార్చి 7 వాల్తేరు డివిజన్ చరిత్రలో ఒక చిరస్మరణీయమైన రోజు.

సిబ్బంది అంకితభావం వల్లే ఈ అద్భుతమైన ఘనత సాధ్యమైందిః అని ఆయన పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో ఆర్థిక సంవత్సరాన్ని మరింత మెరుగైన ఫలితాలతో ముగిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 'దీర్ఘాయుష్మాన్'తో ఉచిత బైక్ అంబులెన్స్ సేవలు



ఆరిలోవ : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12:ఆరిలోవ హెల్త్‌సిటీలోని మెడ్‌సీ ఆసుపత్రి ఆవరణలో దీర్ఘాయుష్మాన్ యాప్‌ను సినీ నటుడు సుమన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీర్ఘాయుష్మాన్ యాప్ ద్వారా ఉచితంగా బైక్ అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయమని చెప్పారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలకు కొన్ని సమయాల్లో అత్యవసర చికిత్సలు అవసరం ఉంటాయని, ఆ సమయంలో అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ ట్రాఫిక్ జామ్, మారుమూల ప్రాంతాలు కావడం వంటి కారణాలతో అనుకున్న సమయానికి చేరుకోక పోవడం, చికిత్స ఆలస్యం కావడం జరుగుతుందన్నారు. ఇటువంటి సమయంలో బైక్ అంబులెన్స్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రమాద ఘటనలు జరిగే సమయంలో తక్షణ చికిత్స అనేది ప్రాణాపాయం నుంచి తప్పిస్తుందన్నారు. దీర్ఘాయుష్మాన్ సంస్థ వ్యవస్థాపకులు మద్దినేని రవిచంద్ర మాట్లాడుతూ, బైక్ అంబులెన్స్ ద్వారా ఒక నర్సుతో పాటు వైద్యుడు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. దీర్ఘాయుష్మాన్ యాప్ లేదా టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించడం ద్వారా బైక్ అంబులెన్స్‌తో అత్యవసర వైద్య సేవలు పొందవచ్చన్నారు. మెడ్‌సీ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ శిరీషా రాణి మాట్లాడుతూ, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలకు శ్రీ రామరక్ష హెచ్పీవి వాక్సిన్... మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ రెడ్డి ...




రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: యుక్త వయస్సులో ఉన్న 14, 15 సంవత్సరాల బాలికలకు హెచ్పీవి వాక్సిన్ శ్రీ రామరక్ష అని స్థానిక పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం రెంటచింతల పీహెచ్సీలో మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినిలకు ఆరోగ్య కార్యకర్తలచే హెచ్పీవి వాక్సిన్ చేయించి మాట్లాడారు. ఈ వాక్సిన్ (టీకా) వేయించుకోవడం వలన బాలికలకు భవిష్యత్లో గర్భాశయ కాన్సర్, రొమ్ము కాన్సర్ వంటి వ్యాధులు రావన్నారు. సుమారు రూ.10 వేలు విలువైన ఈ టీకాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చి బాలికలకు ఉచితంగా వేయిస్తున్నట్లు తెలిపారు. 2011 మార్చి నుంచి 2012 ఫిబ్రవరి 28 లోపు పుట్టిన బాలికలకు మాత్రమే ఈ వాక్సిన్ వేయడం జరుగు తుందన్నారు. స్థానిక పీహెచ్సీలో ప్రతి రోజు ఉదయం 10 గం. నుంచి సాయంత్రం 4 గం. వరకు వాక్సిన్ వేస్తారని ఈ సమయం లో బాలిక వద్ద తల్లిదండ్రులలో ఎవరో ఒకరు తప్పు కుండా ఉండాలని సూచించారు. ఈ అవకాశాన్ని బాలికల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని వాక్సిన్ వేయించుకన్న బాలికలకు సర్టిఫికెట్ కూడ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, హెల్త్ సూపర్ వైజర్ ఎన్. కోటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, పీహెచ్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలి: సిఐటియు డిమాండ్




ప్యాపిలి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా నిలిచిపోయిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ సిఐటియు అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని జలదుర్గం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్ హుస్సేన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు చిన్న రహి మాన్ హాజరై సంతకాల సేకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్న రహిమాన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మార్చి 1 నుండి నాలుగు పథకాలను (ప్రసవ కానుక రూ.20,000, వివాహ కానుక రూ.40,000, సాధారణ మరణానికి రూ.60,000, అంత్యక్రియలకు రూ.20,000) పునఃప్రారంభిస్తూ జీవో విడుదల చేయడం శుభపరిణామమే అయినా, ఇది కార్మికులను మభ్యపెట్టడమేనని విమర్శించారు. గతంలో అమలైన కీలక పథకాలను ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో ఉన్న రూ.5 లక్షల ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలని, ప్రమాదవశాత్తు అంగవైకల్యం సంభవిస్తే రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.10,000 పెన్షన్ ఇవ్వాలని, ఇల్లు లేని కార్మికులకు ఉచితంగా స్థలం కేటాయించి, బోర్డు నిధులతో ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్లన్నింటినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాలైన కేరళ, తమిళనాడులో ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి కార్మికులను ఆదుకుంటుంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఉన్న పథకాలను తగ్గించడం అన్యాయమని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన ఈ సంతకాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి పంపి ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి పద్మశాలి శ్రీనివాసులు, కార్మిక సంఘం నాయకులు వడ్డే శ్రీనివాసులు, ఆర్. మధు, రాసిపోగుల శివ ప్రతాప్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 14 గ్రామాలకి ప్రతిరోజు శుద్ధ జలాన్ని సరఫరా చేస్తున్నాము- బుచ్చిపాలెం వాటర్ స్కీం నిర్వాహకులు పరుచూరి నాని





పెదకూరపాడు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: పల్నాడు జిల్లాపెదకూరపాడు : అమరావతి మండలంలో ఐదు గ్రామాలకు, పెదకూరపాడు మండలంలో 14 గ్రామాలకు జల జీవన్ మిషన్ ద్వారా బుచ్చిపాలెం వాటర్ స్కీం నుండి నిత్యం శుద్ధ జలాలను అందిస్తుంటే టిడిపిలోనే కొందరు వ్యక్తులు మాపై అసత్య ప్రచారం చేస్తున్నారని బుచ్చియ పాలెం వాటర్ స్కీం నిర్వాహకులు పరుచూరి నాని అన్నారు. బుచ్చియాపాలెం వాటర్ స్క్రీన్ వద్ద గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గత తొమ్మిది నెలల నుండి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆయా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. టెండర్ దక్కకపోవడంతో సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు నిర్మాణ సమయంలో కొన్ని పైప్లైన్లు మరమ్మత్తులకు గురవటంతో ఒకటి రెండు రోజులు మినహా నీటి సరఫరా ఎప్పుడు ఆపలేదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలని సూచించారు. వారంలో రెండు పర్యాయాలు ల్యాబ్ రిపోర్టు ఆధారంగా శుద్ధ జలాలను అందిస్తున్నామన్నారు. బుచ్చియ్యపాలెం గ్రామంలో జరిగే అభివృద్ధిని నిరంతరం అడ్డుపడి ఆటంకాలు సృష్టిస్తున్నారని వాపోయారు. గ్రామంలో ఇప్పటివరకు కోటి రూపాయలు అభివృద్ధి పనులు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకారంతో చేసామన్నారు. కొందరు వ్యక్తులు స్వార్థంగా వ్యవహరిస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. స్కీం లో 14 మంది ఇబ్బంది పనిచేస్తున్నారని వారికి జీతాలు ఇవ్వటం లేదని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. జనవరి ఫిబ్రవరి నెలలు మాత్రమే జీతాలు ఆగాయని గుర్తు చేశారు. వారి వెంట గ్రామ సర్పంచ్ క్రాప పద్మజ, మాజీ సర్పంచ్ వీరశివుడు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## భట్టిప్రోలులో ఘనంగా వైసీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.



భట్టిప్రోలు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12:వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండల పరిధిలోని కొత్తపేట రైల్ గేటు వద్దనున్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పాల్గొని కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి పార్టీ జెండాను ఎగురవేసి వైసీపీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్ బాబు వైసీపీ నాయకులతో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని తెలిపారు గతంతో పోల్చుకుంటే భట్టిప్రోలు మండలం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలలో పార్టీ పట్ల ఉత్సాహం పెరిగిందన్నారు. అదేవిధంగా వేమూరు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు రానున్న రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నీ ముఖ్యమంత్రి చేసుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగనన్న సుపరిపాలన కోసం కృషిచేద్దాం... మండలపార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి



రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి సుపరిపాలన కోసం మనమందరం సమిష్టిగా కృషి చేద్దామని మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ 16 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పార్టీ ఆధ్వర్యంలో రెంటచింతల లోని జండాచెట్టు సెంటర్లో నున్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి పార్టీ జండాను ఆవిష్కరించి అనంతరం కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన కేక్ను కట్ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా 2019 సార్వత్రిక ఎన్నిక ఆ సమయంలో ఇచ్చిన హామీలను 2018-2024 వరకు అమలు చేసిన మాజీ సీఎం జగన న్నను మళ్ళీ 2029 ఎన్నికలలో గెలిపించుకునేందుకు గ్రామాలలలో పార్టీని భలోపేతం చేద్దామన్నారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పార్టీ జిల్లా నాయకులు ఏరువ ప్రతాప్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు పులిహారం వంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఏరువ ప్రతాప్రెడ్డి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్రెడ్డి, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు పాముల సంపూర్ణమ్మ, పార్టీ నాయకులు మద్దిరాల కృష్ణారెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, నవులూరి చెన్నా రెడ్డి, పేర్ల ముత్తయ్య, గొలమారి శ్రీనివాసరెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి, ఆదూరి సాగర్మ్రెడ్డి, చింతా సుబ్బారావు, మున్నా చంద్రం, సీహెచ్ మల్లారెడ్డి, గోలి నాగేశ్వరరావు, యర్రెడ్డు శ్రీనివాసరెడ్డి (రంగా), యర్రెడ్డు చంద్రారెడ్డి, పులి కోటిరెడ్డి, గుండా కిశోర్, కర్నాటి గోపి తదితరులున్నారు..

## కిరాణాషాపులో చోరీ.. రూ.7 వేలు అపహరణ. చోరీకి గురైన రామగురువులుకు చెందిన కిరాణాషాపు.

రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఓ కిరాణాషాపులో గురువారం తెల్లవారు జామున చోరీ జరిగిన ఘటన చోటుచేసుకుంది. మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారికి సమీపంలో పోలీసు స్టేషన్ కు వెళ్లు రహదారిలో ఉన్న పెరుమాళ్ల రామగురువులుకు చెందిన కిరాణాషాపుకు వేసిన తాళాలు పగులగొట్టి షెల్టర్ కొంతభాగం పైకిఎత్తి గల్లపెట్టెలో నున్న సుమారు రూ.7 వేలు నగదును చోరీ చేసినట్లు భాదితుడు వాపోయాడు. 25 సం. నుంచి ఈ షాపులో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నట్లు ఎప్పుడు ఇటువంటి ఘటన జరగలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాలువాయిగేటు, మంచికల్లు గ్రామాలలో ఒకే రోజు చోరీలు జరిగిన విషయం మరువకముందే పోలీసు స్టేషన్ కు వెళ్ళే రహదారిలోనే మరో చోరీ జరగడం తో ప్రజలలో ఆందోళన వ్యక్తం అవుతుంది. మండలంలోని గ్రామాలలో నున్న ప్రదాన కూడలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వికలాంగుల హైస్కూల్ నందు జనసేన జిల్లా కార్యదర్శి జన్మదిన వేడుకలు





నకరికల్లు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ హై స్కూల్ నందు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి సత్తెనపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు సిరిగిరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి వారు కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు తదుపరి విద్యార్థినీ విద్యార్థులకు ఫ్రూట్స్ నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ చేయడం జరిగినది అలాగే తరగతి గదుల్లో ఫ్యాన్ సౌకర్యాలు లేకపోవడంతో రెండు ఫ్యాన్లు డొనేట్ చేయడం జరిగినది అలాగే ఈ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఎవరైనా సరే ఈ సంవత్సరం జరగబోవు పరీక్షలలో ప్రథమ స్థానం పొందిన వారికి 2500 బహుమతి ఇస్తానని తెలియజేశారు వారికి చదువు పట్ల ఎంతో స్ఫూర్తి కల్పించారు ఈ కార్యక్రమం లో రామాంజనేయులు, గాసి నాగేశ్వరావు,బత్తిని సుబ్బారావు, పోతురాజు మల్లిఖార్జున, కాసా శ్రీకాంత్, వేముల నవీన్ , నకరికల్లు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అంబటి సుబ్బమ్మ కి నివాళు లర్పించిన వరికూటి అశోక్ బాబు.



వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: వేమూరు నియోజకవర్గం అమర్తలూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అంబటి రామ్మోహన్ మాతృమూర్తి కీర్తిశేషులు అంబటి సుబ్బమ్మ ఇటీవల స్వర్గస్తులైనారు నేడు సుబ్బమ్మ పెదకర్మ సందర్భంగా వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు వైసీపీ నాయకులతో కలిసి కీర్తిశేషులు శ్రీ సుబ్బమ్మ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. అశోక్ బాబు తో పాటు రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు హిమాం హుస్సేన్ భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు పల్లెకోన సర్పంచ్ బొల్లేదు ప్రతాప్ తదితర నాయకులు ఉన్నారు.

## కోట్లాది మంది జనం గుండె నిండా వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జండా - మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు





అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: 16వ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరావతిలో వై యస్ ఆర్ సీపీ జండాను పెదకూరపాడు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ వై యస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకోసం ప్రజల్లోంచి పుట్టిన పార్టీ వై యస్ ఆర్ సీపీ అని అన్నారు. పార్టీ స్థాపించినప్పటి నుండి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, అధికారం లో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమమే ద్వేయంగా పనిచేసిన పార్టీ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు.

ఈ కార్యక్రమం లో అమరావతి మండలం లోని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

ఆలమూరు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12:. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రమైన ఆలమూరులో గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. మండల కన్వీనర్, చెముడులంక గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకలకు పార్టీ సీనియర్ నేతలు చల్లా ప్రభాకరరావు, యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, నెక్కంటి వెంకట్రాయుడు, నామాల శ్రీనివాస్, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, నల్లి రాజు, కొడమంచిలి హరీష్ కుమార్, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడి ఎన్నికలు హామీలు అమలు జరిగేలా చూడాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. అలాగే 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్సీపీని అధికారంలోకి తీసుకురావాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కేక్ ను కట్ చేసి పార్టీ శ్రేణులు ఒకరికొకరు తినిపించుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ

జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, పార్టీ నేత చల్లా ప్రభాకరరావు సమకూర్చిన నూతన వస్త్రాలను ఈసందర్భంగా పార్టీ శ్రేణులు పేదలకు అందజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అందరూ ర్యాలీగా వెళ్లి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మోటుపల్లి వెంకన్న, పాలంగి ఉమాదేవి, చల్లా నానాజీ, నాయుడు ప్రసాద్, కు పెంటపాటి వెంకట్రావు, తోరాటి గోవిందు, గుత్తుల శ్రీనివాస్, నాతి కుమార్ రాజా, చల్లా భూషణం, కోలా నాని, పిల్లి ధనరాజు, గుత్తుల జయరాజు, గోపు నాగు తదితరులు పాల్గొన్నారు.

## రెంటచింతల గరిష్ట ఉష్ణోగ్రత 41.2 డిగ్రీలు...

రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12:మండల కేంద్రమైన రెంటచింతలలో గురువారం గరిష్ట ఉష్ణోగ్రత 41.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 23.6 డిగ్రీలుగా నమోదైంది. సుర్రుమంటు కాస్తున్న ఎండలకు గ్రామస్తులు. హడలిపోతున్నారు. ఉదయం 10 గం.లనుంది సాయంత్రం 4 గం.ల వరకు కూడ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో గ్రామంలోని ప్రధాన వీధులన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి.. మార్చి రెండోవారంలోనే 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదుకావడంతో రానున్న ఏప్రిల్, మే నెలలో ఎండల తీవ్రత ఇంకేంత పెరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండుతన్న ఎండలకు వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## గర్భాశయ కేన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్

గణపవరం : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12: భవిష్యత్తులో గర్భాశయ కేన్సర్ రాకుండా హెచ్‌పివి వ్యాక్సిన్ నివారిస్తుందని గణపవరం ప్రాదిమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె ఓంకారనాథ్ అన్నారు. గత నాలుగు రోజులుగా 14 ఏళ్ళలోపు 46మంది బాలికలకు టికా వేసినట్లు చెప్పారు. ఈ వ్యాక్సిన్‌పై తల్లిదండ్రులు ఏ విదమైన ఆపోహలు పెట్టుకోవద్దని, చిన్నారులకు టీకా వేయించాలని అన్నారు. అర్హులైన బాలికలకు అందరికీ టికా ఇస్తామని చెప్పారు. గ్రామాల్లో 14 ఏళ్ళ బాలికల లిస్టు తీసుకుని వారందరకి రోజువారిగా వ్యాక్సిన్ వేస్తామని అన్నారు. టికా వేయుంచుకోనే వారు పోను నెంబర్ లింక్ అయిన ఆధార్ కార్డుతో రావాలని అన్నారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ అదికారి జాలాది విల్సన్ బాబు, హెచ్ పి సి హెచ్చ్ పద్మజ, స్టాఫ్ నర్సు కగ సుహాసిని, ఆరోగ్య సహాయకులు ఎం యేహన్, ఎం నల్లయ్య, ఎం ఎల్ హెచ్ పి లు నున్న పాప, టి రూత్ కుమారి, ఏ ఎన్ ఎం ఇంజేటి జయమ్మ, ఆషాలు పాల్గొన్నారు

## బాల్య వివాహాలపై అవగాహన

పెనుగొండ: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 12:మం డలంలోని పెనుగొండ గ్రామంలో మిషన్ శక్తి కార్యక్రమం అంగన్వాడీ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.పోచమ్మ మాట్లాడుతూ స్త్రీలకు, బాలింతలకు, పిల్లల తల్లులకు వారు తీసుకునే ఆహారం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.